సాక్షి
కుమురం భీం
బుధవారం । 6 । మార్చి । 2024



వన్యప్రాణుల లెక్కింపునకు పీఈపీ
వన్యప్రాణుల సంఖ్య తెలుసుకునేందుకు ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్(పీఈపీ)లను ఏర్పాటు చేస్తున్నారు. ఇసుకపై పాదముద్రలను గుర్తిస్తున్నారు. 8లో▸

సిద్ధి హనుమాన్.. మహా జాతర
కౌటాల మండలంలోని శ్రీసిద్ధిహనుమాన్ ఆలయంలో మహాజాతర నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 9లో▸



గరిష్టం/కనిష్టం
37.4 /23.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో బంగారు భవిష్యత్తు



పోటీలు ప్రారంభిస్తున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడలతో గిరిజన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ బాలికల క్రీడాపాఠశాలలో ప్రవేశాల కోసం మంగళవారం జిల్లాస్థాయి అర్హత పోటీలు నిర్వహించారు. డీటీడీవో మాట్లాడుతూ క్రీడాపాఠశాలకు చెందిన విద్యార్థులు చదువుతోపాటు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్నారని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన జిల్లాస్థాయి అర్హత క్రీడలకు 124 మంది బాలికలు, 74 మంది బాలురులు హాజరయ్యారని తెలిపారు. వీరికి 9 అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారు ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ రాణించిన విద్యార్థుల్లో 20 మందిని హైదరాబాద్‌లోని బోయినపల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ కి ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, జీసీడీవో శకుంతల, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, హెచ్‌ఎం కృష్ణమూర్తి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 143 మంది గైర్హాజరు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షకు 4,798 మంది విద్యార్థులకు 4,798 మంది హాజరు కాగా 143 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శంకర్ తెలిపారు. జనరల్ విభాగంలో 4,125 మందికి 4015 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 673 మందికి 640 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

సిట్టింగ్ స్క్వాడ్‌గా పూర్వ వీఆర్‌ఏలు!
ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో పూర్వ వీఆర్‌ఏ(ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్లు)లను సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించడం చర్చనీయాంశంగా మారింది. గత కలెక్టర్ సొంత నిర్ణయంతో అర్హత లేనివారిని సైతం సిట్టింగ్‌స్క్వాడ్‌గా నియమించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం అలాంటి వారు జిల్లా వ్యాప్తంగా 19 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా సిట్టింగ్ స్క్వాడ్‌గా అధ్యాపకులు, డిప్యూటీ తహసీల్దార్లు, గెజిటెడ్ అధికారులను నియమించాల్సి ఉంటుంది. వీఆర్‌ఏలుగా పని చేస్తూ జూనియర్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరించిన వారికి విధులు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో సీహెచ్‌సీల్లో పని చేస్తున్న థర్డ్ పార్టీ ఉద్యోగులైన శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతి పత్రం అందించారు. ఉపేందర్ మాట్లాడుతూ సీహెచ్‌సీల్లో పని చేస్తున్న థర్డ్ పార్టీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతుండగా కాంట్రాక్టర్లు, అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదిగా ఈపీఎఫ్‌ను కూడా చెల్లించడం లేదన్నారు. కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, చట్టప్రకారం సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, కార్మికులు నవీన్, రమేశ్, చంద్రశేఖర్, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాతో ధీమా

- పీఎం ఫసల్ బీమా యోజన అమలుకు ప్రభుత్వ నిర్ణయం
- ఉచితంగా ప్రీమియం చెల్లించే యోచన
- పెద్దవాగు, ప్రాణహిత వరదలతో ఏటా పంట నష్టం
- పథకం అమలైతే జిల్లా రైతులకు ప్రయోజనం



గూడెం వద్ద వరదలతో దెబ్బతిన్న పంటలు (ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): జిల్లాలో గడిచిన కొన్ని సంవత్సరాలు పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగ నదుల వరదలు ముంచెత్తి పంటలు ముంపునకు గురవుతున్నాయి. ప్రభుత్వం ప్రతిఏటా సర్వేలు నిర్వహిస్తున్నా పరిహారం మాత్రం మంజూరు చేయడం లేదు. అకాల వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయి రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పీఎం ఫసల్ బీమా యోజన అమలుకు నిర్ణయం తీసుకుంది. రైతులపై భారం పడకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేందుకు యోచిస్తోంది. ఈ పథకం అమలైతే జిల్లాలో రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

3.40 లక్షల ఎకరాల సాగుభూమి
జిల్లావ్యాప్తంగా 15 మండలాల పరిధిలో 3.40లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. అత్యధికంగా జిల్లా రైతులు ఏటా సుమారు 2లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తుంటారు. వరి 50 నుంచి 60వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా.. ఆ తర్వాత మిరప, కంది, పెసర, సోయా, కూరగాయలు సాగవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రజలకు వ్యవసాయమే జీవనాధారంగా ఉంది. జిల్లాను ఆనుకుని ప్రాణహిత, పెద్దవాగు, పెన్‌గంగ నదులు ప్రవహిస్తున్నాయి. ఆయా నదులు ఉప్పొంగి ప్రవహించిన సమయంలో పంటలు వేలాది ఎకరాల్లో ముంపునకు గురవుతున్నాయి. ముఖ్యంగా ప్రాణహిత, పెన్‌గంగ, పెద్దవాగు నదుల నుంచి వరద వర్షాలు భారీగా కురిసినపుడు పంట భూముల్లోకి చేరుతోంది. జిల్లా రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలను ఎక్కువగా నష్టపోతుండగా.. ముంపుతో జరుగుతున్న నష్టమే ఎక్కువ ఉంది. 2020, 2021, 2022 సంవత్సరాల్లో ముంపుతో ఏటా దాదాపు 20 నుంచి 25 వేల ఎకరాలలో నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. 2023లో 15వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. మరోవైపు విత్తనాలు మొలకెత్తక, పంట దిగుబడి లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం వ్యవసాయశాఖతో సర్వేలు నిర్వహించి అంచనా వేస్తున్నా.. నష్టపరిహారం నివేదికల వరకే పరిమితమైంది. రైతు గోడు పట్టించుకునే వారు లేక పరిహారం అందడం లేదు.

రైతులకు ఊరట
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన జిల్లా రైతులకు ఉపయోగకరంగా మారనుంది. ఈ పథకం రాష్ట్రంలో అమలైతే ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటల సాగులో నష్టాలు ఎదుర్కొంటున్న జిల్లా రైతులకు ఊరట లభించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం పంటల బీమాను నిలిపివేసింది. రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందించినా పంట నష్టంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. మూడేళ్ల అనంతరం ఫసల్ బీమా యోజన అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించడంతో అన్నదాతల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

2016లో ప్రారంభం
ఏదైనా ప్రకృతి వైపరీత్యంతో పంటలు నష్టపోయినపుడు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో బీమా వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, వ్యాధుల కారణంగా పంటలు నష్టపోతే రైతులకు బీమా వర్తింపజేసి ఆర్థికసాయం అందించడం పథకం ముఖ్య ఉద్దేశం. 2016 జనవరిలోనే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేయనున్న నేపథ్యంలో ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేందుకు మొగ్గు చూపుతోంది. పథకం అమలుపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు అందలేదని, త్వరలో రైతులకు సమాచారం అందిస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు మేలు



పీఎం ఫసల్ బీమా యోజన రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. అన్నదాతలకు ప్రయోజనం చేకూర్చే దిశగా ఈ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం అమలైతే ఆర్థిక నష్టాల నుంచి ఊరట లభిస్తుంది.
– దోని శ్రీశైలం, బీజేపీ జిల్లా కార్యదర్శి

బీమా అవసరం



పంటలు సాగు చేసే క్రమంలో ఎన్నో రకాలు గా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. ఏటా వరదలతో పత్తి సాగు చేస్తూ ఆర్థికంగా దెబ్బతింటున్నాం. ప్రభుత్వపరంగా నష్టపరిహారం చెల్లించడంతో విఫలమవుతున్నారు. పరిహారం అందించేందుకు బీమా అత్యవసరం.
– తాళ్లపల్లి దీపక్‌గౌడ్, రుద్రాపూర్, మం.చింతలమానెపల్లి

పకడ్బందీగా అమలు చేయాలి



ఫసల్ బీమా పథకాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయోజనం చేకూరేలా అవగాహన కల్పించాలి. అధికార యంత్రాగానికి సరైన మార్గదర్శకాలు ఇవ్వాలి. బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలి.
– సొత్పుతె తుకారాం, బాబాసాగర్, మం.చింతలమానెపల్లి

అర్హులందరికీ గ్యారంటీ పథకాలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గ్యారంటీ పథకాలు అర్హులందరికీ అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో ప్రజాపాలన సేవా కేంద్రాల సాఫ్ట్‌వేర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారంటీ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం అవసరమైన ధ్రువపత్రాలు సేకరించి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అవసరం మేరకు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్, విద్యుత్ కనెక్షన్ నంబర్ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, వివరాలు సక్రమంగా లేనివారు మరోసారి అందించాలని సూచించారు. ఒక తెల్లరేషన్ కార్డుపై ఒక గ్యాస్ కనెక్షన్, ఒక విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు మాత్రమే పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. సేవా కేంద్రాల ఏర్పాటుపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ముంచుకొస్తున్న గడువు

- పంచాయతీల్లో పన్ను వసూలుకు మిగిలింది 25 రోజులే..
- లక్ష్యం రూ.5.48 కోట్లు.. వసూలైంది రూ.3.49 కోట్లు
- జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు



తిర్యాణి మండలం రొంపెల్లి జీపీ కార్యాలయం

తిర్యాణి(ఆసిఫాబాద్): సర్పంచుల పదవీకాలం ముగిసి.. ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్న ఈ సమయంలో పంచాయతీల్లో పన్నుల వసూలుకు గడువు ముంచుకొస్తోంది. మేజర్ పంచాయతీలకు మినహాయిస్తే మిగిలిన అన్ని జీపీలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులే. 2023– 24 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు వంద శాతం లక్ష్యం చేరుకోవడంపై దృష్టి సారించారు. ఇప్పటివరకు 63.75 శాతం పన్నులు వసూలు కాగా.. గడువులోగా లక్ష్యాన్ని చేరుకుంటామని సంబంధిత అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఉండటంతో పన్నుల వసూలులో జాప్యం జరిగేది. జూనియర్ పంచాయతీ అధికారుల నియామకం తర్వాత వసూలులో వేగం పెరిగింది. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

టార్గెట్ రూ.5.48 కోట్లు..
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేజర్ జీపీ అయిన ఆసిఫాబాద్‌ను ఇటీవల మున్సిపాలిటీ మార్చగా.. ఏజెన్సీ ప్రాంతం రాజంపేటను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల నుంచి ఆస్తి పన్నులు, పన్నేతర ఆదాయం రూపంలో రూ.5.23 కోట్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే గత రూ.25.60 లక్షలు బకాయిలు కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5.48 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. కాగా. ఇప్పటివరకు రూ.3.49 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మిగిలిన రోజుల్లో రూ.1.99 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.


వందశాతంపై దృష్టి
పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు పన్నులే ప్రధాన ఆదాయ వనరు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. వందశాతం పన్నుల వసూలుకు జిల్లాస్థాయి అధికారులు తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకుంటున్నారు. నూతన కలెక్టర్ కూడా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పన్నుల వసూలుపై దృష్టి సారించారు. సర్పంచులు పదవీకాలంలో ఉండగా.. పంచాయతీ కార్యదర్శులతో కలిసి గృహాల వారీగా తిరుగుతూ పన్నులు వసూలుకు చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారులకు రెండు, మూడు జీపీల బాధ్యతలు ఉండటంతో వారు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో పన్నుల వసూలు తీరు

మండలం	లక్ష్యం(రూ.లక్షల్లో)	వసూలు(రూ.లక్షల్లో)	శాతం
ఆసిఫాబాద్	140.64	88.39	62.85
బెజ్జూర్	18.96	15.42	81.31
చింతలమానెపల్లి	17.46	13.20	75.60
దహెగాం	18.29	10.74	58.72
జైనూర్	33.84	24.33	71.90
కాగజ్‌నగర్	55.64	41.32	74.26
కెరమెరి	22.93	20.22	88.18
కౌటాల	43.08	27.02	62.72
లింగాపూర్	9.43	6.83	72.44
పెంచికల్‌పేట్	10.64	6.23	58.56
రెబ్బెన	32.99	22.36	67.78
సిర్పూర్(టి)	25.78	20.03	77.70
సిర్పూర్(యు)	0.90	0.87	96.67
తిర్యాణి	29.16	15.71	53.88
వాంకిడి	89.18	37.25	41.77

కాంగ్రెస్ గూటికి కోనప్ప..?

- ఈ నెల 12న ముహూర్తం!
- బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తుపై అసంతృప్తి
- కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం



కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్యే

సాక్షి, ఆసిఫాబాద్/కౌటాల: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిర్పూర్ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పలువురు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. సిర్పూర్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోనప్ప ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు చేతిలో స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఓటమి తర్వాత కొంత నిరాశలో ఉన్నారు. ఈ తరుణంలో మంగళవారం బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు పెట్టుకోనున్నట్లు ఆయా పార్టీ అధినేతలు ప్రకటించడంతో కోనప్ప తీవ్ర అసంతృప్తికి లోనయినట్లు తెలుస్తోంది. సిర్పూర్‌లో తన ఓటమికి కారణమైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కలిసి పని చేయడంపై ఆయన సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. ఈ క్రమంలోనే కోనప్ప కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల కార్యకర్తలతో కలిసి మంగళవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లినట్లు సమాచారం. నేడు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఆ పార్టీ ముఖ్య నాయకులతో కోనప్ప భేటీ కానున్నట్లు సమాచారం. అనంతరం నియోజకవర్గంలోని తన అభిమానులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని మహాశివరాత్రి తర్వాత 12 తేదీన కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆయనతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యేలు సైతం పార్టీ మారే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సైతం గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారనే వదంతులు కొంత కాలంగా వినిపిస్తున్నాయి. అయితే కోవ లక్ష్మి బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని ఆ పార్టీ వర్గీయులు స్పష్టం చేస్తున్నారు. మొత్తం మీద ఉమ్మడి ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమనే ప్రచారానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేరిక వార్త బలాన్ని చేకూరుస్తోంది.

బడులు తెరిచేనాటికే యూనిఫాం

- వచ్చే విద్యాసంవత్సరం మొదటి రోజే పంపిణీ
- కుట్టుపని బాధ్యత 'పొదుపు' మహిళలకే..
- ఉమ్మడి జిల్లాకు రూ.2.11 కోట్ల కుట్టుకూలి కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ



4, 5 తరగతుల బాలికల యూనిఫామ్

నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలఅర్బన్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రాష్ట్ర సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. అలాగే పలు రకాల సౌకర్యాల కల్పనకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి పాఠశాలల పునఃప్రారంభం రోజే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ రెండు జతల ఏకరూప దుస్తుల పంపిణీకి కసరత్తు ప్రారంభించింది. ఒక్కో జతకు కుట్టుకూలీగా రూ.50 చొప్పున రెండు జతలకు రూ.100 చెల్లించడానికి నిధులను కేటాయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా కుట్టుకూలి చార్జీలు, యూనిఫామ్ ఆకృతులతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటును మైమరిపించేలా..
పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆకట్టుకునే రీతిలో యూనిఫామ్ ఆకృతులను గతేడాది నిర్దేశించింది. అయితే పాఠశాలలు ప్రారంభమైన తర్వాత యూనిఫామ్ క్లాత్ పంపిణీ చేస్తే విద్యార్థులకు చేరే నాటికి ఆలస్యమవుతోందని భావించిన విద్యాశాఖ ఈసారి బడులు ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు అందించేలా ప్రణాళిక రూపొందించింది. బాలికలకు ఒకటి నుంచి మూడో తరగతి వరకు ఫ్రాక్‌తో కూడిన డ్రెస్, 4, 5 తరగతి చదువుతున్న వారికి స్కర్ట్, 6 నుంచి 12వ తరగతి చదువుతున్న అమ్మాయిలకు పంజాబీ డ్రెస్ కుట్టించుకునేలా ఆకర్షణీయమైన ఆకృతులను విడుదల చేశారు. ఇక బాలురకు ఒకటి నుంచి ఏడో తరగతి చదువుతున్న వారికి షర్టు, నిక్కరు.. 8 నుంచి 12వ తరగతి వారికి షర్టు, ప్యాంటుతో ఎరుపు బూడిద రంగు చెక్స్ కలిగిన క్లాత్‌ను నిర్దేశించారు.

కుట్టుపని స్వయం సహాయక బృందాలకు..
తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం(టీఎస్ హ్యాండ్లూమ్ వివర్స్ కోఆపరేటీవ్ సొసైటీ) ద్వారా విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను పంపిణీ చేసి స్టిచ్చింగ్ బాధ్యతలను పొదుపు స్వయం సహాయక బృందాల మహిళలకు అప్పజెప్పనున్నారు. కుట్టుపని బాధ్యత పొదుపు సంఘాల వారికి అప్పగించడంతో ఆ మహిళలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చెందిన పాఠశాల యూనిఫామ్‌ను జూన్ 1 నాటికి సిద్ధం చేయనున్నారు. కుట్టుపనిలో నైపుణ్యం కలిగిన స్వయం సహాయక బృందాల మహిళలను గుర్తించి వారికి విద్యార్థుల కొలతలు అందించే ప్రక్రియను ఈనెల చివరినాటికి పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ఇప్పటికే ప్రధానోపాధ్యాయుల నుంచి తెప్పించుకున్నారు. పొదుపు సంఘాల మహిళలు విద్యార్థుల కొలతలు తీసుకుని వాటి మేరకు యూనిఫామ్‌ను నిర్దేశిత ఆకృతుల్లో కుట్టాల్సి ఉంటుంది. సరిపడా వస్త్రాన్ని రాష్ట్ర చేనేత సహకార సంఘం టీఎస్‌సీఈవో నుంచి వారికి అందించనున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థుల వారీగా, వయసుల వారీగా యూనిఫామ్ స్టిచ్చింగ్ ఆకృతితో పని భారం పెరిగిందని, కూలీ రూ.50 మాత్రమే ఇస్తున్నారని కనీసం రూ.200 పెంచాలని మహిళలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	విద్యార్థుల సంఖ్య	స్టిచ్చింగ్ నిధులు (రూ.లలో)
నిర్మల్	52,264	52,26,400
ఆదిలాబాద్	67,418	67,41,800
మంచిర్యాల	43,714	43,71,400
కుమురంభీం	48,248	48,24,800

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రజాపాలన సేవా కేంద్రాలు పూర్తిస్థాయి ఏర్పాట్లతో త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్యారంటీ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రజాపాలన కేంద్రాలు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ– డిస్ట్రిక్ట్ మేనేజర్, డీపీవో సమన్వయంతో సాంకేతిక విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి దరఖాస్తులను డిజిటలైజ్ చేయడంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. జిల్లాలో ప్రజాపాలనకు 1.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్, ఉచిత విద్యుత్ పథకాలు అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మొబైల్, ఓటీపీ, ఆధార్, రేషన్ కార్డుల దరఖాస్తులు, గ్యాస్ బుక్ సంఖ్య, డెలివరీ రిపోర్ట్ అన్ని వివరాలు పరిశీలించాలన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 15, పట్టణ ప్రాంతాల్లో 2 ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సహాయకులతో జూమ్ మీటింగ్ నిర్వహించి, దశల వారీగా వివరాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు అభివృద్ధి పనులకు అవసరమైన ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, వైద్య సేవలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 1.71 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయని, అర్హులకు వందరోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూలీల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో చేపట్టే పనులపై అధికారులు సమన్వయంతో పని చేపట్టి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

'ఆదిలాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే'

కౌటాల(సిర్పూర్): ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీపడినట్లు నటిస్తున్నాయని ఆరోపించారు. బహుజన వాదం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌తో కలిసి పొత్తు పెట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, నాయకులు పసునూరి తిరుపతి, రవీందర్‌గౌడ్, బాపు, విఠల్, గట్టయ్య, రాంకుమార్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైన్స్‌షాపులో చోరీ



దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ శశిధర్

రామకృష్ణాపూర్: పట్టణంలోని బీజోన్ ఏరియాలో గల పెద్దమ్మతల్లి వైన్స్‌షాప్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. షాపులో ఉన్న రూ.40 వేల నగదుతో పాటు రూ.20 వేల విలువచేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలిని మందమర్రి సీఐ శశిధర్ పరిశీలించారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై ఆటోడ్రైవర్ ఆత్మహత్య



రవికుమార్ మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన ఓ ఆటోడ్రైవర్ మంగళవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లిబస్తీకి చెందిన ఆటోడ్రైవర్ ఆయిళ్ల రవికుమార్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం కన్నాల రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి తల్లిదండ్రులు, సోదరుడు, సోదరి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గుండెపోటుతో సూపరింటెండెంట్ మృతి



రాధాకిషన్(ఫైల్)

నెన్నెల: నెన్నెల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాధాకిషన్(58) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. వారం రోజులుగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రెండు రోజుల క్రితం డిశ్చార్జ్ అయి హైదరాబాద్‌లోని తన కూతురి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఛాతిలో తీవ్రంగా నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించే లోగానే మృతి చెందాడు.

భార్యను కొట్టబోయి భర్త మృతి



శంకర్ (ఫైల్)

కౌటాల: మద్యం మత్తులో భార్యను కొట్టబోయిన భర్త మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మధుకర్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కనికి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లగూడకు చెందిన కట్టికోళ్ల శంకర్ (36)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంట్లోని బీరువాలోని డబ్బులు తీస్తుండగా అతని భార్య కవిత అడ్డుకుంది. కోపంతో ఆమెను కాలితో తన్నే క్రమంలో కాలుజారి ఇంటి గడపపై బలంగా పడడంతో తల వెనక భాగంలో బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని సీఐ సాధిక్‌పాషా, ఎస్సై మధుకర్ పరిశీలించి వివరాలు సేకరించారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని తల్లి కట్టికోల రాంబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణుల లెక్కింపునకు పీఈపీ

- అడవుల్లో ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌ల ఏర్పాటు
- ఉదయం, సాయంత్రం పరిశీలన
- పాదముద్రల ఆధారంగా జంతువుల సంఖ్య నిర్ధారణ
- జన్నారం డివిజన్‌లో 160 చోట్ల ఏర్పాటు



బర్తన్‌పేట్ బీట్‌లో ఏర్పాటు చేసిన ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్

జన్నారం: అడవిలో వివిధ రకాల వన్యప్రాణులు సంచరిస్తుంటాయి. ఏఏ జంతువులు సంచరిస్తున్నాయో వాటి రకాలు, సంఖ్య తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు అడవిలో ఇసుకతో ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్(పీఈపీ)లను ఏర్పాటు చేస్తున్నారు. అడవిలోని వన్యప్రాణులు వేసవికాలంలో నీరున్న చోటికి వస్తుంటాయి. అలాంటి చోట్ల వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నీటికోసం వచ్చిన జంతువుల పాదముద్రల ఆధారంగా వాటిని లెక్కిస్తారు.

డివిజన్‌లో 160 చోట్ల ఏర్పాటు

వేసవిలో నీటి వసతి ఉన్న ప్రదేశాలలో అధికారులు ఇసుకతో ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌లను ఏర్పాటు చేశారు. డివిజన్‌లోని 40 అటవి బీట్‌లలో బీట్‌కు 4 చొప్పున 160 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో ప్యాడ్ 6 ఫీట్ల పొడవు, 3 ఫీట్ల వెడల్పు ఉంటుంది. నీటి సౌకర్యం ఉన్న చోట్ల, దారుల వెంబడి వీటిని ఏర్పాటు చేస్తారు. సంబంధిత బీట్ అధికారి, లేదా బేస్‌క్యాంప్ సిబ్బంది వాటిని సాయంకాలం చదును చేసి ఉదయాన్నే వెళ్లి పరిశీలిస్తున్నారు. ప్యాడ్‌లపై పడిన అడుగులను బట్టి ఏయే జంతువులు ఇక్కడికి వచ్చాయో తెలుసుకుంటారు. వాటి వివరాలను నమోదు చేసి డివిజన్ కార్యాలయంలో సంబంధిత రేంజ్ అధికారులకు పంపిస్తారు.

ప్రత్యక్షంగా.. పరోక్షంగా..

అడవిలో నివసించే వన్యప్రాణులను అధికారులు రెండు విధాలుగా గుర్తిస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటిని గుర్తించి అంచనా వేస్తారు. సీసీ కెమెరాలు, వన్యప్రాణుల మలం, నేరుగా చూడడం లాంటి ప్రత్యక్ష పద్ధతుల ద్వారా వాటి రకాలను గుర్తిస్తారు. ఫ్లగ్ మార్క్, ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌ల ద్వారా పరోక్ష పద్ధతులతో గుర్తిస్తామని అధికారులు తెలిపారు. ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్ పద్ధతి మాత్రం వేసవిలో ఎక్కువగా చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రతీ బీట్‌లో ఏర్పాటు చేస్తాం



అడవిలో వన్యప్రాణుల రకాలను ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల ద్వారా తెలుసుకునేందుకు ఫ్లగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌లను ఏర్పాటు చేశాం. ప్రతీ బీట్‌లో నాలుగు చోట్ల ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం పరిశీలిస్తున్నాం. వాటి అడుగుల ఆధారంగా వివరాలు నమోదు చేస్తున్నాం. దీని ద్వారా వన్యప్రాణుల రకాలు, సంఖ్య తెలుసుకోవడం జరుగుతుంది.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

'అధికారుల నిర్లక్ష్యంతోనే క్వార్టర్లు కబ్జా'



వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): అధికారుల నిర్లక్ష్యం మూలంగానే సింగరేణి కార్మికులు నివాసం ఉండాల్సిన కంపెనీ క్వార్టర్లు కబ్జాకు గురవుతున్నాయని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని క్వార్టర్లలో కార్మికులే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా జీఎం రవిప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల కోసం యాజమాన్యం నిర్మించిన క్వార్టర్లలో ఇతరులు నివాసం ఉంటున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏరియా ఆర్గనైజర్ ఎస్కే ఇనూస్, కైరిగూడ పిట్ కార్యదర్శి ఖాజా సైఫ్, సీహెచ్ నారాయణ, తదితరులు ఉన్నారు.

కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌కు బాస్ ఎవరు?

- 23 రోజులుగా ఎస్‌హెచ్‌వో కుర్చీ ఖాళీ
- కానిస్టేబుళ్లదే ఇష్టారాజ్యం

మంచిర్యాలక్రైం: జిల్లాలోని కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వో ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ పనిచేసిన నరేష్ ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీల్లో భాగంగా దండేపల్లికి వెళ్లారు. వెళ్లిన నాలుగు రోజులకే కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సమయంలో విధుల్లో నిర్లక్ష్యం, పలు ఆరోపణలతో పోలీస్ ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వో లేకపోవడంతో కానిస్టేబుళ్లదే ఇష్టారాజ్యంగా మారింది. మంగళవారం కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జజ్జరవెల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఓ కానిస్టేబుల్ ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించాడు. ఇందులో ఒకరిని కాపాడేందుకు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త సదరు కానిస్టేబుల్‌తో ఫోన్‌ద్వారా మంతనాలు జరిపిన ఆడియో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. మావోని మీద కేసు కాకుండా చూసుకో.. మీకు రూ.4 వేలు ఇస్తాడని చెప్పిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం గమనార్హం.

ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా కమిటీ నియామకం



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా నూతన కమిటీని యూనియన్ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ మంగళవారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా జెట్టి శంకర్‌రావు, కార్యదర్శులుగా శీలం చిన్నయ్య, రావుల అనిల్, చంద్రమోహన్, కారుకూరి మనోజ్, ఏ.సమ్మిరెడ్డి, ఆకుల రాజన్న, గణపతి మహేష్, గడ్డం మల్లయ్య, సీహెచ్.వెంకటేశ్వర్లు, అశోక్, ప్రసాద్, వెంగళ కుమారస్వామి, ఉపేందర్, ముఖ్య ప్రచార కార్యదర్శి (చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ)గా కొలిపాక సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా తోకల వెంకటస్వామి, దుండె వీరమల్లు, మహేందర్ రెడ్డి, జయాకర్, వెంకటేశ్, కిషన్, రామస్వామి, సత్యనారాయణ, బాలకృష్ణ, రాజు, బుస్స రమేష్, వినోద్, బొద్దున మల్లేశ్, ఎంబడి తిరుపతి, రౌతు సత్యనారాయణ, ప్రణయ్ కొమ్ము వెంకన్న, జక్కుల సాగర్, కొట్టే వెంకటేశ్, సంతోష్, చిలువేరు సదానందం, ప్రచార కార్యదర్శులుగా(ఆర్గనైజింగ్ సెక్రెటరీ) నరసింహస్వామి, సుధాకర్, నీలం సదయ్య, సుధాకర్, శ్రీనివాస్‌రావు, మహేష్ రాజు, విష్ణు ప్రసాద్, ప్రేమ్, బొద్దు ప్రభాకర్, షరీఫ్, పెద్దిరాజు నియామకమయ్యారు.

'ఆర్కే5లో సమస్యలు పరిష్కరించాలి'



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఆర్కే5 గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా మాట్లాడుతూ పాత ఎస్‌డీఎల్ యంత్రాలస్థానంలో కొత్తవి వినియోగించాలని, సపోర్టుమెన్లకు పనిముట్లను అందుబాటులో పెట్టాలని, షిఫ్ట్‌లలో పనిచేసే ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లకు హెల్పర్లను ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నాయకులు బద్రి బుచ్చయ్య, నర్సింగరావు, మల్లేశ్, జీపీ రావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

మంచిర్యాలక్రైం: అక్రమంగా తరలిస్తున్న 22 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివిధ వార్డుల్లో బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం స్థానిక సున్నంబట్టి, సూర్యనగర్ ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు. ట్రాలీని తనిఖీ చేయగా 22 క్వింటాళ్ల రేషన్‌బియ్యం లభ్యమయ్యాయి. బియ్యం తరలిస్తున్న ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన వానరాసి ఉమమహేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యం విలువ సుమారు రూ.70,400 ఉంటుందన్నారు. వాహనాన్ని, బియ్యం స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం టాస్క్‌ఫోర్స్ టీమ్‌కు అప్పగించారు. పట్టుకున్న వారిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాకేష్, తిరుపతి, రాజు ఉన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'తోట'



మాట్లాడుతున్న తోట రాజేశ్

మంచిర్యాలఅర్బన్: పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన తోట రాజేశ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న హెచ్‌ఆర్‌డీ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో 13 మందితో నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు



సంఘటన స్థలంలో కారు, బైక్

కౌటాల: మండలంలోని తాటిపల్లి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన తరుణ్‌కుమార్ కారులో తాటిపల్లి హనుమాన్ ఆలయానికి వచ్చి వెళ్తున్నాడు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లికి చెందిన ఎకొన్‌కార్ మధుకర్ బైక్‌పై తాటిపల్లి గ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్నారు. బైక్ నుజ్జునుజ్జు కాగా కారు ముందు భాగం దెబ్బతింది. బైక్‌పై ఉన్న మధుకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తస్కరించిన సొమ్ము రికవరీ

చెన్నూర్: చోరీకి గురైన సొమ్మును గంట వ్యవధిలోనే రికవరీ చేసి బాధితునికి అప్పగించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఎటెల్లి సమ్మయ్య మంగళవారం అవసరం నిమిత్తం చెన్నూర్ ఎస్‌బీఐలో రూ.20 వేలు డ్రాచేసి ఇంటికి వెళ్తుండగా మసీదు నల్లా వద్ద డబ్బులు పక్కనపెట్టి దాహార్తి తీర్చుకున్నాడు. ఆ తర్వాత డబ్బులు కన్పించలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజీ ఆధారంగా కానిస్టేబుల్ రాజశేఖర్, హోమ్‌గార్డు ఖదీర్ గంట వ్యవధిలోనే డబ్బులు కాజేసిన వ్యక్తిని గుర్తించారు. అతని వద్ద నుంచి నగదు రికవరీ చేసి బాధితునికి అప్పగించారు.

ప్రజాభవన్‌కు సింగరేణి సమస్యలు

- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- ప్రజాభవన్ నుంచి కలెక్టర్లకు బట్వాడా
- అక్కడి నుంచి ఏరియాల జీఎంలకు
- పరిశీలనలో కంపెనీ అధికారులు



హైదరాబాద్ ప్రజావాణిలో దరఖాస్తులతో నర్సరీ కాంట్రాక్ట్ మహిళా కార్మికులు (ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణికి ప్రజావాణి దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. అన్నిఏరియాల్లోని జీఎం కార్యాలయాలకు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ గడప తొక్కుతున్నారు. ప్రతీ మంగళ, శుక్రవారం నిర్వహించే ప్రజావాణిలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నారు. సంస్థలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏరియాస్థాయిలో పరిష్కారం కాకుంటే కార్పొరేట్ ఆఫీసులో దరఖాస్తు చేసుకుంటారు. ఇక్కడ కూడా పరిష్కారం కానివి ఉంటున్నాయి. కంపెనీ నిబంధనలు, ప్రభుత్వ విధానాలు, కోర్టు ఆదేశాలు పరిష్కారానికి ప్రతిబంధకంగా ఉంటున్నాయి. ఈ కారణంతో పరిష్కారం కాకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కార్మికులు ఇప్పుడు ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారు.

ప్రజావాణి టూ సింగరేణి..

ప్రజాభవన్‌లోని ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు ఆ పేషీ అధికారులు పరిశీలించి వాటిని దరఖాస్తుదారుడుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లకు పంపిస్తున్నారు. కలెక్టర్లు వాటిని పరిశీలించి పరిష్కారం కోసం ఆయా ఏరియాల జీఎం కార్యాలయాలకు పంపిస్తున్నారు. ఇలా వందల సంఖ్యలో దరఖాస్తులు ప్రజావాణి నుంచి సింగరేణికి వచ్చి చేరుతున్నాయి. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో ఈ తరహా దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

సమస్యలు అనేకం..

ప్రజావాణికి వస్తున్న దరఖాస్తులు ఎక్కువగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాల పెంపునకు సంబంధించినవే ఉంటున్నాయి. జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని కాంట్రాక్ట్ కార్మికులు పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. వీటితోపాటు కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయస్సును 35 నుంచి 40 ఏళ్లకు పెంచాలని, మారుపేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలని, ప్రమోషన్లలో ఇబ్బందులు, రిటైర్డ్ కార్మికుల సమస్యలపై దరఖాస్తులు ప్రజావాణిలో వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి దరఖాస్తులు ఏరియా స్థాయిలో పరిష్కారం కావు. వారు తిరిగి కార్పొరేట్ ఆఫీస్‌కు ఫార్వార్డ్ చేస్తున్నారు. అక్కడ కూడా కొన్ని పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలతో ముడిపడి ఉన్నందున వీటిపై ప్రభుత్వ పెద్దలను సంప్రదించే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం ఆదేశిస్తే పరిష్కారం అయ్యే సమస్యలు కూడా ఇందులో ఉన్నాయి.

మేడారం ఓవర్‌బ్రిడ్జిపై కారు బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన కారు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగులపేట జాతీయ రహదారిలో మేడారం ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం కారు బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్సై మజీద్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం తాండూరు మండలం కొత్తపల్లికి చెందిన ప్రసాద్ సొంత పనినిమిత్తం కారులో మంచిర్యాలకు వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రున్ని 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక డంపులు సీజ్



సీజ్ చేస్తున్న రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది

జైపూర్: జైపూర్ మండలం ఇందారం సమీపంలోని కాచన్‌పల్లి శివారులో నిల్వ చేసిన 38 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. తమకు అందిన సమాచారం మేరకు తహసీల్దార్ వనజారెడ్డి, ఆర్ఐ తిరుపతి గోదావరినది ఒడ్డున వరలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ పక్కన తుమ్మపొదల్లో నిల్వచేసిన ఇసుకను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దిగుబడిపై దిగాలు.. ధరపైనే ఆశలు



పంటచేనులో ఆరబోసిన మిర్చి పంట

- వర్షాభావ పరిస్థితులతో తగ్గిన దిగుబడి
- గతేడాదికంటే పడిపోయిన ధరలు
- దిగాలు పడుతున్న రైతన్నలు
- తడిసి మోపెడైన ఖర్చులు..

చెన్నూర్: ఈ ఏడాది మిర్చి ధర పడిపోయింది. గతేడాది క్వింటాలుకు రూ.23వేలు ధర ఉండగా ప్రస్తుతం రూ.14 వేలు మాత్రమే ధర పలుకుతోంది. గతేడాదితో పోలిస్తే క్వింటాలు మిర్చికి రూ.9వేలకు పైగా ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా మిర్చి పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. దిగుబడితో పాటు ధర కూడా తగ్గడంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా చేతికివచ్చే పరిస్థితులు లేకపోవడంతో మిర్చిరైతులు తలలు పట్టుకుంటున్నారు. ధర పెరిగితే నష్టాల నుంచి గట్టెక్కుతామని ఆశతో ఉన్నారు.

1,714 ఎకరాల్లో సాగు

ఈ ఏడాది జిల్లాలో 930 మంది రైతులు 1,714 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. గతేడాది క్వింటాలుకు రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు ధర పలికింది. ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ఈసారి ధర పెరగకపోయినా గతేడాది వచ్చిన ధరయినా వస్తుందని రైతులు ఆశపడ్డారు. కానీ పంట సమయంలో మొక్కలకు వేరుకుళ్లు, ఇతర వైరస్‌లు సోకడంతో ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్లకు మించి పంట దిగుబడి రాలేదు. ధరలేక దిగుబడి రాక రైతులు పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చేదని ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన సాగు ఖర్చు

మిర్చి పంట సాగుకు ఈ ఏడాది ఎకరాకు రూ.1.50 లక్షలకు పైగా అయిందని రైతులు పేర్కొంటున్నారు. విత్తనాల దగ్గర నుంచి మందుల ఖర్చు రెట్టింపు అయ్యింది. దీనికితోడు పంటకు వివిధ రకాల వైరస్‌లు సోకడంతో సాగు ఖర్చు మరింత పెరిగింది.

పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి



ఈ ఏడాది పదెకరాల్లో మిర్చి పంట వేశా. పెట్టుబడి ఖర్చు రూ.15 లక్షల వరకు అయ్యింది. ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చేలా ఉంది. ధరలు కూడా తగ్గడంతో పెట్టుబడి రాలేని పరిస్థితి ఉంది.

– మానిశెట్టి శ్రీనివాస్, మిర్చి రైతు, చెన్నూర్

షెడ్డులో బైక్‌లు.. చెట్లకిందే సైకిళ్లు



పాఠశాల ఆవరణలోని షెడ్డులో బైక్‌లు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైకిల్‌స్టాండ్‌లో ద్విచక్ర వాహనాలు దర్శనమిస్తున్నాయి. అవి ఉపాధ్యాయులు, విద్యార్థులవి అనుకుంటే పొరపాటే. పాఠశాలకు గేట్లు ఉన్నా తాళం వేయకపోవడంతో మంచిర్యాల నుంచి ఇతర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లేవారు తమ బైక్‌లను పాఠశాల ఆవరణలోని షెడ్డులో నిలిపివెళ్తున్నారు. దీంతో విద్యార్థులు తమ సైకిళ్లను చెట్ల కింద ఎండలో నిలిపి ఉంచాల్సిన పరిస్థితి. పాఠశాల గేటుకు తాళం వేసి ఇతరుల వాహనాల పార్కింగ్‌కు కట్టడి చేయాలని పాఠశాల విద్యార్థులు కోరుతున్నారు.